

# మతృక

ఎమ్మెస్సార్ మూర్తి

**అది కురుక్షేత్రం!**

**ఆ మహాభారత యుద్ధం మొదలవబోతున్నది!**

**ఇరుపక్షాల - అతి రథ మహారథులు - యోధులు - రథ గజ తురగ కాల్బలాలు - సన్నిద్ధంగా ఉన్నారు.**

**ఈ సన్నివేశాన్ని గమనించిన ఆకాశ మానసం నిర్లిప్తత చిక్కగా దిక్కులు పంచుకుంది.**

ఉదుటున... ఒక్క ఉదుటున లేచింది సంగాత. ఆ నిశ్శబ్దతను గండభేరుండ పక్షుల గుంపులో తనొక్కటే చటుక్కున పసిగట్టింది.

క్షణాలు. మరికొన్ని క్షణాల్లో కురుక్షేత్ర అంతరిక్షం మీద పచార్లు చేస్తోంది సంగాత.

సర్వ శాస్త్ర పారంగతుడైన మహా పండితుడు ఉన్నత స్థానం చేరుకుని కూడా దర్ప సర్పభ్రాంతుడైనట్లు, అంత ఊర్ధ్వ అంతరిక్షంలో ఉన్నా రేపో మాపో వీర మరణం పొందబోయి పార్థివ శరీరాలుగా మిగిలే కళేబరాల మీదే సంగాత మనసు సంలగ్నమైంది.

ఆ భయంకర విహంగ వీక్షణంలో...

వీరావేశంతో విరాజిల్లుతున్న అతిరథులు, మహారథులు, టెక్కెములతో తేజరిల్లుతున్న రథాలు -

అందమైన గంటల మందలింపులతో అందంగా తప్ప అడుగులు వేయలేక పోతున్న గజ గమనాలు, సవ్వడి రవ్వలకు ఉవ్వెత్తున లేచే సందోహంలో ఉన్న తురగాలు -

పోరాటం తమదే అయినా విజయం యజమానిదే అని, ఎంతకీ తెలియని స్వామి భృత్యన్యాయంలో మైమరచిన కాల్బలాలు -

నినాదాల అదనుకు పదునుగా పైపైన ఎండుగడ్డి మంటతో వెచ్చనయిన దుందుభి, భేరీ ముఖాలు వీరావేశపు టూపిరితో దిక్కులు పిక్కటిల్లజేయనున్న తూర్యాలు, కొమ్ములు -

కురు పాండవుల యుద్ధ సాన్నిధ్య దృశ్యం - సంగాత గుండెల్లో - తాను గండభేరుండమైనా తన గుండెల్లో - ఏదో గుబుక్కుమంది.

అంతే!

సంగాత గర్భిణి. పేశీకోశరింలో కాబోయే తన బిడ్డ గుడ్డు గుడ్డుగానే జారింది - కురుక్షేత్రంలో అలా అలా పడబోతున్నది.

గండభేరుండం తల్లిలాగే అల్లల్లాడి పోయింది.

అంత అంతరిక్షంలో తన సంతానం తనంతట తానుగా జారి ఇంకో క్షణంలో సంగ్రామ క్షేత్రంలోనే పడనున్నది.

సంగాత ఒక్కసారి కళ్లు మూసుకుంది.

శూన్యమైన మాతృ హృదయం అనన్యచింతతో "కృష్ణా" అంది.

అంతరిక్షం ఉలిక్కిపడింది.

పడుతూన్న గుడ్డు - దుందుభి, భేరీ చర్మాలని వేడిచేసి వీర ధ్వనుల శృతికి సాయత్తం చేసే నిమిత్తం మంట వేయడానికి తెచ్చిన ఎండుగడ్డి మీద పడింది.

మహా భారత యుద్ధం మొదలైంది.

నమస్కార బాణాలు స్వస్థానాలను చేరుకున్నాయి.

ఓ వీరుడు వేసిన బాణం ఓ మదగజం మెడకు తగిలింది. గాయం కాలేదు. గంట త్రాడుకు మాత్రమే తగలడంతో గంట త్రాడు తెగింది.

ఏనుగు మెడలోని ఆ పెద్ద ఇత్తడి గంట సరాసరి వచ్చి ఆ గడ్డిమీదనే...

ఆ గండభేరుండపు గుడ్డును ఆవరిస్తూ అలా పడి నిలబడింది.

...

మహా భారత యుద్ధం ముగిసింది.

...

మరుక్షేత్రమై పోయిన కురుక్షేత్రాన్ని పరిశుభ్రం చేయడానికి ఉద్యమిస్తున్న భట సమూహంలోని ఓ భటుడు దూరంగా ఎండుగడ్డి మీద నున్న ఏనుగు గంటను చూస్తూ ఎంతో ముచ్చటపడి పరుపున పోయి బరువుగా ఉన్న ఆ గంటను ముద్దుగా ఎత్తాడు.

అంతే!

తల్లి రెక్కల కింద పొదగబడిన దానిలా ఆ గండభేరుండ శిశువు అలా... అలా...

'అమ్మా.. అమ్మా, అంటూ ఆకాశంలోకి ఎగురుతూ వెళ్లిపోయింది.